ఇచ్చిన హామీ వైసీపీ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

- ఆగ్రీ గోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరు
- అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సనపల నర్సింహులు

విశాలాంధ్ర - గార : వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని, అగ్రిగోల్డ్ డిపాజిట్ దారులకు వెంటనే చెల్లింపులు చెయ్యాలని ఆగ్రి గోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సనపల నర్సింహులు డిమాండ్ చేశారు. 'అగ్రి' అసోసి యషన్ అధ్వర్యంలో చేవడుతున్న సత్యాగ్రహ దీక్షలలో బాగంగా సోమవారం శ్రీకాకుళం నియోజకవర్గం అగ్రిగోల్డ్ బాధితుల సత్యాగ్రహ దీక్షలను నగరం లోని రామలక్ష్మణ కూడలి వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహులు దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన మాట ముఖ్యమంత్రి నిలబెటు ్టకోవాలని, అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్య దొంగలను శిక్షించి, అగ్రిగోల్డ్ సంస్థలను ప్రభుత్వ పరం చేసుకొని వారి ఆస్తులు అమ్మి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అధికారం లోకి వచ్చిన ఆరు నెలల్లో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన వైసీపీ నాయకులు కొంత మొత్తం డబ్బులు జమ చేసి చేతులు దులుపుకోవడం దారుణం అన్నారు. ప్రజా సంక్షేమ ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ పెద్దలకు అగ్రిగోల్డ్ బాధితుల ఆక్రందన పట్టడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీ నెరవేర్చకుండా వైసీపీ ఎన్నికలకు వెళితే వారికి బుద్ధి చెప్పడానికి బాధితులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చే లోగా బాధితుల అందరికీ డబ్బులు చెల్లించాలని, మృతి చెందిన కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా అందించాలనీ, లేని పక్షంలో వైసీపీ నీ నమ్మే ప్రసక్తే లేదని, ఎవరైతే అగ్రిగోల్డ్ బాధితులకు స్పష్టమైన హామీ ఇస్తారో ఆ పార్టీకే అసోసియేషన్ మద్దతు తెలుపుతుందన్నారు. ఈ పోరాటాల్లో బాగంగా ఈ నెల 18న అన్ని జిల్లాల్లో స్పందన కార్యక్రమంలో వినతి పత్రాలు ఇస్తుందన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో విజయవాడలో బాధితులు, ఆత్మహత్య చేసుకొని, మనో వేదతో చనిపోయిన కుటుంబాల తో 30 గంటల వియోచన దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాధితులు అందరికీ న్యాయం జరిగే వరకూ పోరాటం సాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 'అగ్రి' అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయ సింహ, జిల్లా కార్యదర్శి గోవింద రావు, అసోసియేషన్ నాయకులు కొయ్యాన రాజారావు, కింజరాపు రాజారావు, ఐ వీ రమణ, కోరాడ శ్రీనివాసరావు, సూరయ్య, పెద్ద సంఖ్యలో బాధితులు తదితరులు పాల్గొన్నారు.

దీక్షలకు పలువురు సంగీభావం : అగ్రిగోల్డ్ బాధితులు చేసిన దీక్షలో మాజీ మంత్రి, టీడీపీ నాయకులు గుండ అప్పల సూర్య నారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, ఏఐటీయుసీ జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల గోవింద రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస రావు, సీపీఐ జిల్లా సమితి సభ్యులకు నిమ్మాడ కృష్ణమూర్తి, ప్రజా నాట్య మండలి నాయకులు శ్రీనివాస రావు, లిబరేషన్ నాయకులు శ్రీనివాస రావు, తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

అవిలింగిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర - సారవకోట/జలుమూరు : మండలం అవిలింగి సచివాలయం పరిధి అవిలింగి, ఎస్సీ కాలనీ, కూరాకుల వీధిలి గ్రామాల్లో సోమవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి జిల్లా పార్టీ అధ్యక్షులు నరసన్నపేట సీనియర్ శాసనసభ్యులు ధర్మాన కృష్ణ దాస్, పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ లు ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందు తున్నాయా లేదా అన్న విషయాన్ని లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్లెట్లను లబ్దిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో సారవకోట మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు గ్రామ ప్రజలు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకాంత్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : రాష్ట్ర తూర్పుకార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ జన్మదిన వేడుకలు ఎల్ఎన్‌పేట మండల కూడలి నందు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎల్ఎన్‌పేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనం తరం కేక్ కట్ చేసి శ్రీకాంత్‌కు జన్మదిన వేడుకలు తెలిపారు. వృద్ధులకు, మహిళలకు పండ్లు, మిఠాయిలు, శాలువాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసి కిలారి త్రినాథులు, వైకాపా నాయకులు కిలారి వెంకటరమణ,గేదెల శ్రీనువాసరావు, కె.అర్జునరావు, బుక్క చంద్రర రావు, బాలి మనోజ్, జి.విశ్వేశ్వరరావు, కళ్యాణ దాలెప్పడు, కె.జగన్నాథం, పనుకు క్రిష్ణారావు, పైల తవిటినాయుడు, శ్రీను పండా పలువురు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కారానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చొరవ చూపాలని ఏ.పి. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏ.ఐ.టి.యు.సి. అనుబంధం) అధ్యక్ష,ప్రధాన కార్య దర్శులు ఎం.రాఘవ, కళ్యాణి అప్పల రాజు, జే.గురు మూర్తి డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సోమవారం శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పర్మినెంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేసేంత వరకు ధరలకనుగుంగా కానీస వేతనం 26 వేలు రూపాయిలు అమలు చేయాలన్నారు. అందరికీ ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లకు 18 వేలు వేతనం ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచి, సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎన్నికల హామీలో అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికులందరికీ పర్మినెంట్ చేసి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని మాటిచ్చిన ముఖ్యమంత్రి నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తాను ఇచ్చిన హామీలు అమలుకు పూనుకోవాలని, లేకుంటే ఎన్నికల హామీల అమలు కోసం ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.కార్మికులు సమస్యలు పరిష్కా రించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్. పార్థసారథి, ఆర్.గణేష్, ఎ. మనీంద్ర కె.రామచంద్ర, సీతమ్మ, ఏ.రవణ, ఇందిర, సూర్యకల, పార్వతి, తారక, వెంకట్రావు, సీపీఐ నాయ కులు టి.తిరుపతి రావు, ఏ.ఐ.టి.యు.సి.ముఖ్య సలహాదారు చిక్కాల గోవిందరావు పాల్గొన్నారు.

తుఫాను కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

మాజీ మంత్రి గుండా అప్పల సూర్యనారాయణ

విశాలాంధ్ర - గార : మిచౌంగ్ తుపాను, కరువు నష్టాలపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని అఖిలపక్షాల నేతలు డిమాండ్ చేశారు. తుపాను, కరువు నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించి శ్రీకాకుళం జిల్లాకు తక్షణ ఆర్థిక సాయం చేసి బాధిత రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని కామ్రేడ్. ఎన్ఆర్ దాసరి క్రాంతి భవన్ లో సోమవారం రౌండ్ టేబుల్ సమావేసాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి అధ్యక్షత వహించారు. రైతులు తుపాను ప్రభావంతో తీవ్ర ఇక్కట్లకు గురయ్యారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని, కరువు, తుపాన్ వల్ల నష్టపోయిన రైతులు, వ్యవసాయ కార్మికులు, వరద బాధితులను ఆదుకోవాలని, పంటనష్టాలు అంచనా వేయించి, రైతులకు నష్ట పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు గుండా అప్పలసూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 లక్షల ఎకరాలకుపైగా అపార నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం మాత్రం 1.47 లక్షల హెక్టార్లలో మాత్రమే పంటనష్టం జరిగినట్లు ప్రకటించటం దారుణమన్నారు. శ్రీకాకుళం జిల్లా తీర ప్రాంత జిల్లా కావడంతో లక్షలాది ఎకరాల పంటలు నీటమునిగాయన్నారు. నష్టపోయిన పంటలను గుర్తించి అక్రమాలు జరగకుండా ఎన్యూమరేషన్ చేయాలని, కౌలు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధితో పాటు రైతుసంఘాల బాధ్యులతో ఎన్యూమరేషన్ కమిటీ వేయాలని సూచించారు. రైతును నిలబెట్టాల్సిన ప్రభుత్వాలే నడ్డివిరిస్తే ఆర్థిక క్షీణత ఏర్పడి ఆ కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. దేశానికి రాష్ట్రానికి ఆర్థికంగా బలాన్ని చేకూర్చేది రైతేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు చిక్కాల గోవిందరావు,సిపిఎం కౌలు రైతుసంఘం నాయకులు ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి కళాకారుడు శ్రీనివాసరావు, సిపిఐ సమితి సభ్యులు నిమ్మడ కృష్ణమూర్తి, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఎం యుగంధర్, కొన్న శ్రీనివాస రావు, రైతు సంఘం జిల్లా కన్వీనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛను రూ.6 వేలకు పెంచాలి

విశాలాంధ్ర - సోంపేట : పేదలకు అందించే సామాజిక పింఛను 6వేల రూపాయలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య శ్రీకాకుళం జిల్లా సమితి డిమాండ్ చేసింది. సమితి ప్రతినిధి ఆరేలమ్మ ఆధ్వర్యంలో పలువురు మహిళలతో కలిసి సోమవారం ఈ మండలం ఉప్పలాం సచివాలయం వద్ద నినాదాలు చేశారు. సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం అందజేస్తున్న 2,750 రూపాయలు ధరలు పెరుగుదల దృష్ట్యా ఏ మాత్రం సరిపోదని అన్నారు. వృద్ధులు, వితంతువులకు న్యాయం చేయాలని కోరారు.

అన్నదానం మహాదానం

ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర

విశాలాంధ్ర - అరసవల్లి : అన్నదానం మహా దానంతో సమా నమని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో నగరం లోని ఏడురోడ్ల జంక్షన్‌లో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్య క్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్‌జీవో సంఘ రాష్ట్ర ఉపా ధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, డాక్టర్ సూర శ్రీనివాస రావు మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారన్నారు. అన్నం లేనిది ఏ ప్రాణి జీవించ లేదని, అన్నం ఎటువంటి లోటు లేకుండా దొర కడం గొప్ప అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో 2,500 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కొత్తూరులో ఘనంగా మామిడి జన్మదిన వేడుకులు

విశాలాంధ్ర - కొత్తూరు : రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ పుట్టిన రోజు వేడుకలు సోమ వారం కొత్తూరు వైసీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వ హించారు. ఏ.ఎం.సి మాజీ చైర్మన్ గోగుల మాధవి వరప్రసాద్ నాయుడ అధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ముందుగా స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో రోగులకు గర్భిణీలకు పల్లు, రొట్టెలును అందజేశారు. అనంతరం వైసీపీ మండల కార్యా లయంలో మాధవి వర ప్రసాద్ నాయుడు స్థానిక వైసీపీ నాయుకులు సర్పంచ్ వడాల కృష్ణవేణి ప్రతినిధి పడాల లక్ష్మణరావుతో కలిసి మామిడి పుట్టినరోజు సంద ర్భంగా కేక్ కట్ చేశారు కాపు సామాజిక వర్గ ప్రయోజ నాలుకు, వారి అభ్యు న్నతికి పాటు పడుతున్న నాయు కులు మామిడి శ్రీకాంత్ అని మాట్లాడిన వక్తలు అన్నారు. పలురు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం భారీగా అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయుకులు. వియేసియేస్ డైరెక్టర్ కుంచాల నూకరాజు చుక్క రాంబాబు పిన్నింటి రామారావు నాయుడు పాల్గొన్నారు

గణిత క్విజ్ పోటీల్లో ప్రతిభ

విశాలాంధ్ర - మందస : మండల స్థాయిలో నిర్వహించిన గణిత క్విజ్ పోటీల్లో జి.ధనలక్ష్మి (ప్రథమ స్థానం), ఎస్.పవన్, ఎస్.బాలు, ఎస్.మహా లక్ష్మీ, జి.క్రిష్ణ, రాకేష్‌లకు జోనల్ స్థాయి ఆటల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందడంతో మండలం జి.ఆర్.పురం ప్రధానో పాధ్యా యులు ఎస్.ఎర్ర న్నాయుడు విజేతలను సోమవారం అభి నందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో కూడా తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని, భవిష్యత్‌లో మరెన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు మల్లీకార్జునరావు, వ్యాయామ ఉపాధ్యాయురాలిని టి.గీతలను అభినందించారు.

బొర కుటుంబానికి రూ.5 లక్షలు బీమా

విశాలాంధ్ర - మందస : మండలం పొత్తంగి గ్రామానికి చెందిన జనసేన నాయకులు బొర శేషగిరి మార్చిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. జనసేన పార్టీలో క్రియాశీల సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు 5 లక్షల రూపాయలు ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించి కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపిన ప్రకారం బొర శేషగిరికి 5 లక్షల రూపాయలు ప్రమాద బీమా వర్తించింది. సోమవారం చెక్‌ను పిఏసి చైర్మన్ నాదేండ్ల మనోహార్ బొర శేషగిరి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడాలనే సంకల్పంతో క్రియాశీలక సభ్యత్వం కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త పాలవలస యశస్విని, దుర్గారావు, దిలీప్‌కుమార్ పాణిగ్రాహి, సురేష్‌లు పాల్గొన్నారు.

గోవింద స్వాములు ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న దాసునాయుడు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ మండలం మరువాడ పంచాయతీ గుడ్డిమీదపేట గ్రామంలో సోమవారం జరిగిన గోవింద స్వాములు ఇరుముడి కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు పాల్గొన్నారు. గోవింద స్వాములు గురు స్వామి, మాజీ మండల వైస్ ఎంపీపీ సూరాడ భీమారావు బృందం ఆహ్వానం మేరకు దాసునాయుడు కార్యక్రమంలో పాల్గొని గోవిందస్వాములు సన్నిధానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి సహస్రనామాల పారాయణంలో పాల్గొన్నారు. అనంతరం తెలుగు యువత కార్యదర్శి సూరాడ రాయుడు, అర్జాల రాజు కుటుంబ సభ్యులు చేసిన అన్నదాన కార్యక్రమంలో తనవంతుగా దాసునాయుడు భక్తులకు అన్నం వడ్డించారు. అనంతరం గోవింద స్వాములు కుటుంబ సభ్యులు భక్తులతో మాట్లాడి ఈ ప్రాంత బాగోగులను తెలుసుకున్నారు. అనంతరం అన్నదానం చేసిన సూరాడ రాయుడు సతీమణి సూరాడ సంతోషి లహరి దాసు నాయుడుకు తిలకం దిద్ది ఇరుముడి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి సూరాడ దాసురాజు, మరువాడ పంచాయితి సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, సంతబొమ్మాళి మండలం తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి సురాడ దనారాజు, టెక్కలి నియోజకవర్గం తెలుగు యువత నాయకులు కూచెట్టి భాను ప్రకాష్, బెండి అరుణ్ కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు పరపటి రాజశేఖర్, మైలిపిల్లి శ్రీరాములు, కొవిరి కోటేశ్వరరావు పాటు పలువురు తెలుగుదేశం నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

జగన్ పాలనతో రాష్ట్రం సర్వనాశనం

టెక్కలి నియోజకవర్గ తెలుగుయువత మహిళ అధ్యక్షరాలు శైలజ

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమారుడుగా జగన్మోహన్‌రెడ్డి ప్రజా రంజక పాలన చేస్తారని ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే, పరిపాలన అవగాహన రహిత్యంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని టెక్కలి నియోజక వర్గ తెలుగుయువత మహిళ అధ్యక్షరాలు పూజారి శైలజ సత్యన్నారాయణ అన్నారు. సోమవారం మండలం హరిశ్చంద్రపురం గ్రామ పంచాయతీ చిన్న హరిశ్చంద్రపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను టిడిపి నాయకులతో కలిసి అందజేశారు. అలాగే ప్రతి ఇంటికి తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానూ చేపట్టబోయే పథకాలు గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ల చెల్లింపులకు గతిలేక, అప్పుడు చేసే దౌర్భాగ్య స్థితికి రాష్ట్రాన్ని ఈ ప్రభుత్వం తీసుకు వచ్చిందని అమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉప్పాడ జయరాం, కోట అప్పన్న, బమ్మిడి పాల్గుణరావు, ఉప్పాడ చలపతిరావు, ఉప్పాడ అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలం చీపుర్లపాడు, కోటబొమ్మాళి, తిలారు, సరియాపల్లి తదితర గ్రామాల్లో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

'డాడీ హెల్పింగ్ ఫౌండేషన్'ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : అనాధలకు, నిరాశ్రయులైన వృద్దులకు సమాజంలో ప్రతీ ఒక్కరూ అండగా ఉండాలని డాడీ హెల్పింగ్ ఫౌండేషన్ అధినేత ప్రభాస్ సూర్య (గుజ్జల సూర్యనారాయణ) అన్నారు. శాంతినగర్ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మందిరంలో ఆదివారం బిజిఆర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ బరాటం చక్రవర్తి, ఆక్స్ ఫోర్డ్ స్కూల్ డైరెక్టర్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ బి కిరణ్ కుమార్, ఎం సునీత, పీపుల్ సేవ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పిడుగు నరేష్ లు అందించిన నిత్యాసర సరుకులను 60 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ పేదలకు ప్రతినెలా బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాగాటి ఆదినారాయణ, డాడీ హెల్పింగ్ ఫౌండేషన్ సభ్యులు ప్రసాద్, బుడ్డు, నాగేంద్ర, చక్రి, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మాణిక్యపురం విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - కవిటి : నంద్యాల వేదికగా ఈనెల 12వ తేదీ నుండి 14వ తేదీ వరకు ఎస్‌జిఎఫ్ అండర్ 17 త్రోబాల్, అథ్లెటిక్స్ విభాగాలలో మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యా యురాలు బి.సుమలత తెలిపారు. ఈ మేరకు అండర్ 17 త్రోబాల్ పోటీలకు తొమ్మిదవ తరగతి విద్యార్థి దీపక్ దొళాయి, అలాగే అండర్ 17 అథ్లెటిక్ పోటీలకు 10వ తరగతికి చెందిన పొదిలాపు దుదిష్టి ఎంపిక అయినట్లు తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఉపాధ్యా యులు, గ్రామస్తులు, విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలలో విద్యార్థులను అభినందించి రాష్ట్ర ఈ పోటీలలో రాణించి జాతీయస్థాయికి ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. వీరి విజయానికి కృషి చేసిన పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు రవి మహంతి, మర్రిపాటి తోటారావులను పలువురు అభినందించారు.

రైతులను బిచ్చగాళ్లగా చూస్తున్న ప్రభుత్వం : డీసీసీ అధ్యక్షులు పేడాడ

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఎకరాకు 13వేల రూపాయలు తీసుకొని బిక్షగాళ్ళ గా చూస్తుందని డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు విమర్శించారు. రైతులకు న్యాయం జరగాలంటూ స్పందన కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు తహశీల్దార్ కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ గిరిరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాన్ వలన జరిగిన నష్టాన్ని ఇంత వరకు అంచనా వేయకపోవడం దారుణమని, ఒక వైపు రైతులు కరువు మండలాల ప్రకటన కోసం ఎదురు చూస్తుండగా మరో వైపు అకాల వర్షాలతో వారు ఘోరంగా దెబ్బ తిన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు కొంత సొమ్ము విదిల్చడం ప్రభుత్వ బాధ్యత కాదని, కాంగ్రెస్ పాలనలో నిర్మించిన ప్రాజెక్టుల నీరు కూడా సక్రమంగా వినియోగించుకునే పరిస్థితుల్లో ప్రస్తుత పాలకులు లేరని అన్నారు. వంశధార ప్రాజక్టు నిర్మాణం జరిపితే నేడు ఆ కాలువల్లో పూడిక తీసేందుకు కూడా ప్రభుత్వం సిద్ధపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా స్పందన కార్యక్రమంలో రైతుల గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందని, తక్షణమే రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు చొక్కర గంగేయ్య, తిర్రి శాంతారావు, టి.మధుసూధనరావు, మద్దు శాంతమూర్తి, లోకనాథం, ఎస్.ఈశ్వరరావు, రుద్రమూర్తి, వెంకటేశ్వరులు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం అందజేయాలి : కాంగ్రెస్ నాయకులు దువ్వాడ

విశాలాంధ్ర - పలాస : బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో పలాస నియోజక వర్గంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టం పరిహారం అందజేయాలని పలాస నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పలాస ఆర్డీవో భరత్ నాయిక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ వలన సంభవించిన వర్షాలకు అనేక చోట్ల తీవ్ర పంట నష్టం జరిగిందని, వరికోతల సమయంలో అకాల వర్షాలు పడడంతో అనేక ప్రాంతాల్లో కోసిన వరిచేను పొలాల్లో ఉండిపోయిందని, మరికొన్ని ప్రాంతాల్లో కోతకు వచ్చిన పంట నేలవాలి నీట మునిగిందని అన్నారు. దీనివలన రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని, వారిని ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే అనేక మండలాల శివారు ప్రాంతాల రైతులు వర్షాలు లేక కరువు బారిన పడగా ఇంత వరకు ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లాలో కరువు మండలాలను ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాన్ వలన వరి పంట నష్టం విస్తీరణం ప్రకటించాలని, నష్టపోయిన రైతులందరికీ వెంటనే పరిహారం ప్రకటించాలని, జిల్లాల్లో కరువు మండలాలను ప్రకటించి తక్షణం కరువు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్.శ్యామ సుందరరావు, కొర్ల హేమారావు చౌదరి, సురేష్, తంగుడు వీర్రాజులు ఉన్నారు.

పూర్వపు విద్యార్థుల తోడ్పాటు జూనియర్లకు కావాలి : ఐతమ్ డైరెక్టర్

విశాలాంధ్ర - టెక్కలి : ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్, ఎంటెక్, ఎంబిఎ కోర్సులు పూర్తిచేసి అనేక సాఫ్ట్వేర్ కంపెనీల్లో, వివిధ రంగాల్లో, పలు హోదాల్లో విధులు నిర్వహిస్తున్న పూర్వపు విద్యార్థులు ఐతమ్‌లో పలు కోర్సుల్లో చదువుతున్న జూనియర్లకు పూర్తి తోడ్పాటును అందించి వారి భవిష్యత్కు మార్గదర్శులు కావాలని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్. ఎల్.నాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావులు కోరారు. హైదరాబాదులోని ఒక హోటల్లో ఐతమ్ 19వ పూర్వపు విద్యార్థుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సాంకేతికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ల్యాబ్స్ ఏర్పాటు, విద్యాబోధన, సిలబస్ మార్పులపై ఎప్పటికపుడు కళాశాలకు ప్రత్యక్షంగా వచ్చి లేదా ఆన్లైన్ ద్వారా సూచనలివ్వాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు కోరారు. ఈ సదస్సులో అల్యూమినీ కో-ఆర్డినేటర్ డాక్టర్ వై.యుగంధర్, ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సంతోష్, 2006 బ్యాచ్ కు చెందిన సిఎస్ఈ విద్యార్థి ఎస్.సంతోష్, 2007 బ్యాచ్ ఐటి విద్యార్థులు క్రిష్ణచైతన్య, 2008 బ్యాచ్ విద్యార్థి పవన్ వైశ్యరాజు, 2016 బ్యాచ్ ఈఈఈ విద్యార్థి ప్రశాంత్, 2018 బ్యాచ్ సివిల్ విద్యార్థి ఆకాష్, పి.స్వాతి, లిఖిత, హేమంత్, జయరాగ్ లతో పాటు 180 మంది విద్యార్థులు హాజరయ్యారు.

నష్టపోయిన ప్రతి రైతుని ఆదుకుంటాం : మంత్రి ధర్మాన

విశాలాంధ్ర - నందిగాం : కరువు ఏర్పడి నష్టపోయిన ప్రతి రైతుని ఆదుకుంటామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు హామీ ఇచ్చారు. సోమవారం నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తి స్వగృహంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ తో కలిసి విలేకరుల సమావేశంలో ధర్మాన ప్రసాదరావు మాట్లాడారు. నందిగాం మండలంలో పూర్తిగా వరి పంట ఎండిపోయిన రైతులందరికీ ఆదుకోవాలని తిలక్ మంత్రిని కోరారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు కరువు మండలంగా ప్రకటించి రైతన్న ఆదుకుంటామని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రైతాంగానికి ఏం చేశారని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రైతులు, కార్యకర్తలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని దీనివల్ల అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి జడ్పిటిసి సభ్యులు అధ్యక్షులు కురమాన బాలకృష్ణ రావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు కింతల ధర్మారావు, నందిగాం సర్పంచ్ జద్యాడ జయరాం, ఎంపీటీసీ సభ్యులు అంబోడి విష్ణు, మండల ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు, మండల మండల అధ్యక్షులు పాల్గుణరావు, వైస్ ఎంపీపీ సువ్వారి వసంతరావు, నందిగామ మండలంలోని ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తూర్పుకాపు సామాజిక భవన నిర్మాణానికి 8 సెంట్ల స్థలం వితరణ

రూ.కోటి 20 లక్షల స్థలాన్ని వితరణ చేసిన ఆ ముగ్గురు

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : గత మూడు దశాబ్దాలుగా తూర్పుకాపు సంక్షేమ సంఘానికి వివిధ కార్యక్రమాల నిర్వహణకు తమ సామాజిక వర్గానికి సంబంధించిన సమా వేశాలు ఏర్పాటుకు జిల్లా కేంద్రంలో ఎటువంటి భవనం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే మూడు దశాబ్దాలు కళ నెరవేరేలా ఎంతో దాతృత్వంతో మంచి మనస్సుతో సామాజికవర్గానికి సుమారు రూ కోటి 20 లక్షల విలువ చేసే స్థలాన్ని తూర్పుకాపు సామాజికవర్గానికి సుమారు ఎనిమిది సెంట్ల స్థలాన్ని ముగ్గురు ప్రతినిధులు వితరణగా అందజేశారు. వారిలో ఒకరు రాష్ట్ర తూర్పుకాపు సంక్షేమం సంఘం కార్పొరేషన్ ఛైర్మన్ మామిడి శ్రీకాంత్ కాగా మరొకరు జిల్లా స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొంది, యువతకు అన్ని విధాలుగా ప్రోత్స హించడం లోనూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న అందరి మన్ననలు పొందిన మెంటాడ స్వరూప్ మరొకరు, ఇజ్జాడ శివన్నారాయణ (శివ)లు తమ సామాజికవర్గానికి ప్రయోజనం కలిగిలే మూడు దశాబ్దాల కల నెరవేర్చేందుకు ఎంతో దా తృత్వంతో 8 సెంట్ల స్థలాన్ని సంక్షేమ సంఘానికి అందజేశారు. డబ్బు ,ఆస్తీ ,సంపద అందరికీ ఉంటాయి. అయి నప్పట్టకీ తమ సామాజికవర్గం ప్రయో జనం కోసం వితరణ చేసే మన స్తత్వం మంచి మనస్సు కొందరికే ఉంటుంది. వీరు ముగ్గురు ముందు వరుసలో ఉంటారనడంలో ఎటువంటి అతిసయోక్తి లేదు. ఈ మేరకు సోమ వారం జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో పెద్దపాడు రోడ్డు దరిలో హారికా ఇన్ సమీపంలోగల తమకు చెందిన ఎనిమిది సెంట్ల స్థలాన్ని డాక్యూ మెంట్లపై సంతకాలు చేసి సంబంధిత ప త్రాలను అందజేసి తూర్పుకాపు సామాజిక వర్గానికి వితరణగా అంద జేయడం జరిగిందని మామిడి శ్రీకాంత్‌తో పాటు మెంటాడ స్వరూప్, ఇజ్జాడ శివన్నారాయణలు తెలిపారు. తమవంతు సామాజిక బాధ్యతగా తమ తూర్పుకాపు సామాజికవర్గ భవన నిర్మాణానికి మేము సైతం అంటూ హారికాకనస్ట్రక్షన్స్ అధినేత హారికా ప్రసాద్ రూ. 10 లక్షలు, కె. గణేష్ 10 లక్షలు, కలిశెట్టి గణపతి రూ 5 లక్షలు ఆర్థికంగా వితరణ అందజే స్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో పాండ్రంకి రమేష్, కైలాశరావు, సామాజికవర్గ పెద్దలు పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ జవాన్ మృతితో కొత్తపల్లిలో విషాదచాయలు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దుబ్బ రామారావు (36) కిడ్నీ సమస్యతో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ జీబిహెచ్ జనరల్ అసుపత్రిలో మృతి చెందారని కుటుంబసభ్యులకు, గ్రామస్థులకు సమాచారం రావడంతో మృతదేహం కోసం ఎదురుచూస్తు భార్య పిల్లలు, తల్లిదండ్రులు, స్నేహితులు, గ్రామస్థులు రోధనలతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే రామారావు రాజస్థాన్ ఉదయ్‌పూర్ 162 బెటాలియన్‌లో పని చేస్తున్నాడని డూటీలో ఉన్నప్పుడు కడుపు నొప్పి రావడంతో ఆసుపత్రికి అదికారులు తీసుకువెళ్ళగా ఆయనకు పరీక్షలు నిర్వహించి కిడ్నీ పని చేయటం లేదని, డయాలసిస్ చేయాలని వైద్యులు చెప్పడంతో అందుకు ఇదే విషయం భార్య దివ్వభారతికు అధికారులు తెప్పగా, అసుపత్రిలో చికిత్స అందించాలని భార్య కోరగా చికిత్స చేస్తుండగా రామారావు ఆదివారం ఉదయం మృతిచెందారు. దీంతో తల్లిదండ్రులు కరువయ్య, లచ్చమ్మలు భార్య దివ్య భారతి, కుమార్తెలు లేఖ్య, హర్షిణీలు ఉన్నారు. మృతదేహం సోమవారం రాత్రికి గ్రామానికి చేరవచ్చునని బిఎస్ఎఫ్ వర్గాలు తెలిపాయి. వాయుమార్గంలో భువనేశ్వర్ వరకు వస్తుందని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో రావడం జరుగుతుందని, మంగళవారం ఉదయం అంత్య క్రియలు జరుగుతాయని తెలిపారు. దీంతో రామారావు ఇంటివద్ద కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు కన్నీరు మున్నీరయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

సీఎం పర్యటనపై వైకాపా నేతలు సమావేశం

విశాలాంధ్ర - సోంపేట : రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ నెల 14న కంచిలి మండలం మకరాంపురం వద్ద జల జీవన్ మిషన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రారంభానికి, అలాగే పలాసలో వైఎస్సార్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మరియు పరిశోధనా కేంద్రం ప్రారంభానికి హాజరు కానున్న నేపథ్యంలో ఇచ్ఛాపురం వైకాపా ఇన్‌చార్జ్ పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం సోంపేటలో వైకాపా నేతలు సమావేశమై చర్చించారు. ఎంఎల్‌సి నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా, సోంపేట, కంచిలి ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులంతా ఈ సమావేశంలో పాల్గొని ముఖ్యమంత్రికి స్వాగతం పలికే అంశాలు చర్చించాల్సిన అంశాలు గురించి మాట్లాడారు.

జగనన్నే మా నమ్మకం ... మా ధైర్యం : ఎంపీపీ ఉమామల్లేశ్వరరావు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అంటే ప్రజలకు ఓ నమ్మకం...గుండె ధైర్యం ఓ భరోసా... అని అవ్వాతాతలకు పెద్ద మనవడిగా ఉండడం వల్ల అని కుటుంబాలు సుఖసంతోషాలుతో జీవిస్తున్నారని మళ్ళీ మళ్ళీ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఓటు వేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. సోమవారం మండలం పెద్దబమ్మిడి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను వివరించి ప్రజలు లబ్ధి పొందుతున్న వాటిపై వివరిస్తూ తెలియపరిచారు. అనంతరం గ్రామంలో వైయస్సార్ జెండాని అవిష్కరించారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాల సేకరణ కిట్లు వాలంటీర్లు పంపిణీ చేశారు. అదే క్రమంలో గ్రామంలోని కొన్ని కుటుంబాలు అందుతున్న పథకాల వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు స్థానిక సర్పంచ్ బమ్మిడి గణపతి, జేఎస్‌సీ కన్వీనర్ గద్దవలస నాగభూషణరావు, వైకాపా నాయకులు పేడాడ వెంకటరావు, మెట్ట సింహాచలం, సింగుపురం వినోద్, హనుమంతు తేజ, బమ్మిడి శ్రీరాములు, కార్యదర్శి రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి అన్న ప్రసాదంపై భక్తులు విమర్శలు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : కలియుగ దేవుడైన శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీవారి అన్న ప్రసాదం పై భక్తులు విమర్శలు వస్తున్నాయని శ్రీవారి దర్శనం కి వెళ్ళిన భక్తుడు, సంతబొమ్మాళి మండలం, బోరుభద్ర గ్రామ నివాసి గొనపు అప్పన్న విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానానికి శ్రీవారి దర్శనార్థమై కుటుంబ సభ్యులతో వెళ్ళామని, వేంగమాంబ అన్న ప్రసాద నిలయంలో అన్నప్రసాదానికి వెళ్ళేటప్పుడు అన్నం ముద్దలుగా మారిందని, మేము మాతో పాటు చాలా మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. కొంత కాలం క్రితం 15 మంది భక్తులు అన్న ప్రసాదం తినేందుకు ఇబ్బంది పడ్డారని వచ్చిన విమర్శలు తెలిసిన విషయమేనని ఆయన అన్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చిన లక్షలాదిమంది భక్తులు దైవ ప్రసాదం స్వీకరిస్తే మంచి జరుగుతుందని అన్న సత్రాలకు వెళ్లి అన్న ప్రసాదం స్వీకరిస్తుంటారని, అటువంటిది అన్న ప్రసాదం ముద్దల ముద్దలుగా ఉండడం వలన తినలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో తిరుపతిలో ఉన్న ప్రైవేటు హొటళ్లకు ప్రైవేటు హొటల్స్కు, రెస్టారెంట్లకు వెళ్లి భోజనం చేయవలసిన వస్తుందని ఆయన అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఉన్నతాధికారులు గ్రహించి తిరుపతికి వస్తున్న లక్షలాదిమంది భక్తులకు ఆకలి తీర్చే అన్న ప్రసాదాన్ని సక్రమంగా భక్తులు ఆరగించే విధంగా చూడాలని ఆయన అధికారులు కోరారు.

లాండ్ టైటిల్ చట్టాన్ని రద్దు చేయాలి : న్యాయవాదుల డిమాండ్

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన లాండ్ టైటిల్ చట్టం సామాన్య ప్రజలకు గొడ్డలిపెట్టు అని ఈ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ న్యాయ వాదులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు ఆధ్వర్యంలో న్యాయవాదులు శ్రీకాకుళంలో జిల్లా కోర్టు నుంచి జిల్లా పరిషత్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్పందనలో జిల్లా రెవెన్యూ అధికారికి ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. భవిష్యత్తులో ఈ చట్టం రద్దు కోసం అవసరం అయితే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, పొన్నాడ రాము, గ్రంథాలయ కార్యదర్శి, ఎం భవానీ ప్రసాద్, ఆంధ్ర ప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమా మహేశ్వర రావు, చౌదరి లక్ష్మణ రావు, సీనియర్ న్యాయవాదులు, కె. అన్నం నాయుడు, సూర అప్పల నాయుడు, సూర వేణు గోపాల రావు, గురుగుబెల్లి నర్సింహ మూర్తి, సనపాల హరి, కె అమ్మినాయుడు, బొత్స సుదర్శన్, ఎ. కృష్ణంరాజు, కె. ప్రతాప్ చంద్ర, పి. నాగేశ్వర రావు, ఎ ఎల్ నారాయణ, టి. ఖాగేంద్ర నాథ్, గొందు ప్రసాద్, ఎం. శ్రీనివాస్ పాల్గొన్నారు.

మనోధైర్యమే దివ్యాంగులకు దివ్య ఔషధం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : మనోధైర్యమే దివ్యాంగులకు దివ్య ఔషధ మని మండల విద్యాశాఖ అధికారి జల మూరు చిన్నవాడు, అర్జునుడు అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సంద ర్భంగా, సోమవారం సంతబొమ్మాళి భవిత కేంద్రంలో దివ్యాంగుల విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో దివ్యాంగులకు చిన్నచూపు చూడరాదని, నిరంతరము వారికి మనోధైర్యం కల్పించి ఆటలు ఆడించి, ఫిజియోథెరపీ, వంటి వివిధ రకాల ట్రీట్మెంట్లతో పునర్ స్మృతి కలిగి మంచి వ్యక్తులుగా తయార వుతారని వారన్నారు. అంతకు ముందు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వివిధ రకాల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రమణమూర్తి, రాంబాబు సంతబొమ్మాళి శాఖ గ్రంథాలయ అధికారి కే.కృష్ణారావు, సంతబొమ్మాళి ఎంపీ మోడల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అంగూరు రామారావు తో పాటు పలువురు ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరునికి భక్తుల తాకిడి

విశాలాంధ్ర - జలుమూరు : కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో దక్షిణ కాశీగా పేరొందిన శ్రీ ముఖలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తాకిడి పెరిగింది. జలుమూరు మండలం శ్రీముఖలింగంలో కొలువైన శ్రీ ముఖలింగేశ్వర స్వామి ఆలయానికి సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడి ప్రారంభమైంది. జిల్లా నలుమూలలతో పాటు పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం, విశాఖపట్నం, ఒడిస్సా ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకున్న ప్రముఖులు... శ్రీముఖలింగేశ్వరుని సోమవారం రాష్ట్ర శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం, వాణీసీతారాంలు దర్శించుకున్నారు. అలాగే జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి బొడ్డేపల్లి మీనాక్షితో పాటు హైకోర్టు ట్రుబునల్ న్యాయ మూర్తి డి.రామలింగేశ్వరరావులు స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను వివరించారు.

14న పలాసకు సీఎం రాక

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పద్మనాభపురం వద్ద 50 కోట్ల రూపాయలతో నిర్మించిన 200 పకడల ఆసుపత్రితో పాటు కిడ్నీ పరిశోధన కేంద్రంను ప్రారంభించేందుకు ఈ నెల 14వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పలాసకు వస్తున్నారని రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అనుకున్న షెడ్యూల్డ్ ప్రకారం ఈ నెల 15న పలాస రావాల్సి ఉండగా పర్యటన సి.ఎం కార్యాలయం నుంచి డిసెంబరు 14వ తేదీన వస్తున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. ముఖ్య మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా సి.ఎం పర్యటన ఏర్పాట్లు ముమ్మరంగా చేపడుతున్నామని తెలిపారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - వజ్రపు కొత్తూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఈ నెల 14వ తేదీన పలాస కాశీబుగ్గలో నిర్మించిన 200 పడకల ఆసుపత్రితో పాటు కిడ్నీ పరిశోధన కేంద్రం ప్రారంభిస్తారని, కనుక ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి ప్రతినిధి ఉదయ్‌కుమార్ కోరారు. సోమవారం ఎపిఎం అధ్యక్షతన మండల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన పలాసలో జరిగే ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రారంభోత్సవ కార్యక్రమానికి వజ్రపుకొత్తూరు మండలం నుంచి ప్రతి మహిళ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎఆర్‌ఎం జంబవతి, మండల మహిళా అధ్యక్షురాలు జల్లు ఉషారాణి, ఎపివో కేశవరావులు పాల్గొన్నారు.

మాతా శిశు రక్షణకు తగిన పోషకాహారం తీసుకోవాలి

వైద్యాధికారులు డాక్టర్ అవని, వనిత

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : మాతా శిశు రక్షణకు తగిన పోషకాహారం తీసుకోవాలని బోరుభద్ర పిహెచ్‌సి వైద్యాధ కారులు డాక్టర్ అవని, వనితలు అన్నారు. బోరుబద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ప్రతీ గర్భిణిలకు, శిశువులకు ఆశా కార్యకర్తలు తగిన సలహాలు సూచనలు చేయాలని కోరారు. వైద్యాధికారులు ఆదేశాలు మేరకు, స్తానిక అశా కార్యకర్తలు గర్భిణీలు, చంటిపిల్లల, ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ కమలమ్మ, ఆశా కార్యకర్తలు వాణి, వరలక్ష్మి, మండల యువత అధ్యక్షుడు ముద్దపు ఆనందరావు పాల్గొన్నారు.

అభివృద్ధి వైపు పయనం

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర - పోలాకి : ప్రజాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని నరసన్నపేట సీనియర్ శాసన సభ్యులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సోమవారం మండల కేంద్ర పరిధి ఊరజాంలో జరిగిన కార్య క్రమంలో మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. అభివృద్ధి వైపే ప్రజలు ఉన్నారని అన్నారు. ఉర్జాం గ్రామం నుండి పోలాకి వరకూ రూ.35 లక్షలుతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకు స్థాపన అనంతరం మాట్లాడారు. సర్పంచ్ కణితి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరెగినాయుడు, ఏఎంసి చైర్మన్ దుంపల భాస్కరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కోట అప్పారావు, పార్టీ నాయకులు చింతాడ ఉమామహేశ్వరరావు, రెంటికోట త్రినాథరావు, పల్లిపేట పీరువాడు, సర్పంచ్లు భూషి రమణ, దంత రమణ, పోలాకి మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరులో మన ఇంటికి రండి

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం నువ్వలరేవు గ్రామంలో మన ఇంటికి రండి కార్యక్రమాన్ని సోమవారం డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కుపల్లి, నువ్వలరేవు, వంకులూరు, హుకుంపేట గ్రామాలకు చెందిన 10 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కేంద్రంలోను రాష్ట్రంలోను కాంగ్రెస్ పార్టీ మాత్రమే మత్స్యకారులకు మేలు చేసిందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కార్యక్రమంలో చొక్కర గంగేయ్య, శాంతారావు, మధుసూధనరావు, వెంకటరావులు పాల్గొన్నారు.

మిచౌంగ్ తుఫాన్ వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వ ఆదుకోవాలి

కలెక్టర్‌కి వినతిపత్రం అందించిన కాంగ్రెస్ నాయకులు

విశాలాంధ్ర - అరసవల్లి : మిచౌంగ్ తుఫాన్ వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వ ఆదుకోవాలని కాంగ్రెస్ నాయకులు గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వర రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు, పిసిసి ప్రధాన కార్యదర్శులు పైడి నాగభూషణరావు, అంబటి కృష్ణారావు, రెల్ల సురేష్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, డి. గోవింద మల్లిబాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, కూరాకుల వెంకటరావు, జిల్లా ఎస్సీ నాయకులు, ఎస్.ధర్మారావు, అంబటి దాలినాయుడు, గార మండల అధ్యక్షులు గ్రీవెన్స్ సెల్ లో పలు సమస్యలపై కలెక్టర్ వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పిసిసి ప్రధాన కార్యదర్శి పైడి నాగభూషణ రావు, అంబటి కృష్ణారావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఇటీవల సంభవించిన వర్షాలకు అనేక చోట్ల తీవ్రపంత నష్టం జరిగింది, వరి కోతల సమయంలో సంభవించిన అకాల వర్షాల వల్ల అనేక చోట్ల కోసిన వరి చేను పొలాల్లో ఉండిపోయింది మరి కొన్నిచోట్ల కోతకు వచ్చిన పంట నేటమునిగింది ఫలితంగా రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది ఇప్పటికే అనేక మండలాల శివారు ప్రాంతాల రైతులు వర్షాలు లేక కరువు బారిన పడగా ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లాలో ఇంతవరకు కరువు మండలాలు ప్రకటించ లేదన్నారు. ప్రస్తుతం పంట చేతికి వచ్చే సమయానికి అనేక చోట్ల అకాల వర్షాల వల్ల రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. పెట్టుబడి వృధాగా రైతులు వీధిన పడ్డారని, కనుక రైతులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలను చేపట్టాలని వారి డిమాండ్ చేశారు. మిచౌంగ్ తుఫాను వల్ల వరి నష్టం జరిగిన పంట విస్తీర్ణం ప్రకటించాలని, నష్టపోయిన రైతులందరికీ వెంటనే పరిహారం ప్రకటించాలని, జిల్లాలో కరువు మండలాలు ప్రకటించి తక్షణ కరువు నివారణ చర్యలు చేపట్టాలని మరియు శ్రీకాకుళం, ఆమదాల వలస మధ్య ఉన్న ప్రధాన రహదారి గత కొంతకాలంగా నిర్మాణ పనులు ఎప్పుడో ప్రారంభించి అనేక సంవత్సరాలు గడుసున్నప్పటికీ ఇప్పటికీ నిర్మాణం పూర్తి కాలేదని, రోడ్డు అధ్వానంగా ఉండడం వల్ల ఎంతోమంది ప్రమాదాలకు గురై ప్రాణాలు కూడా కోల్పోయారన్నారు. దీనిపై ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. రోడ్డు నిర్మాణ జాప్యానికి గల కారణాలను వెంటనే తెలియజేస్తూ గుత్తే దారులపై చర్యలు తీసుకుని వెంటనే నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

రాజగోపాలరావుతోనే జిల్లా సస్యశ్యామలం

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మాజీ పార్లమెంటు సభ్యులు స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాల రావుతోనే జిల్లా సస్యశ్యామలం అయిందని హరిశ్చంద్ర పురం, ఎత్తురాళ్ళ పాడు, రేగులపాడు పంచాయతీల సర్పంచ్‌లు గురివెళ్ళి కేశవరావు, తలగాన గణపతిరావు, సీపాన సోమేశ్వరావులు అన్నారు. సోమవారం మండలం జాతీయ రహదారి హరిశ్చంద్రపురం కూడలిలో కొత్తగా ఏర్పాటు చేసిన బొడ్డేపల్లి రాజగోపాల రావు విగ్రహన్ని వారు అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజగోపాలరావు ఆరు పర్యాయాలు పార్లమెంటు సభ్యులుగా ఏకదాటిగా జిల్లాలో ఆదిపత్యం వహిస్తూ అనేక బృహత్కరమైన కార్యక్రమాలు చేపట్టారన్నారు. తనకు కేటాయించిన మంత్రి పదవిని సైతం శాదిస్తూ జిల్లాకు వంశధార ప్రాజెక్టు తీసుకువచ్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయరాన్నారు. అనగారి, అంతరించిపోతున్న కాళింగ కులాన్ని బీసీ జాబితాల్లో చేర్పించి కుల ఉన్నతిని పాటుపడ్డారన్నారు. బొడ్డేపల్లి రాజగోపాలరావును కేవలం ఒక్క కులానికే పరిమితం చేయవద్దని, ఆయన తెచ్చిన ఫలాలను అన్ని జాతులు, వర్గాలవారము అనుభవిస్తున్నామని రాజగోపాలరావు ఖ్యాతిని జిల్లాకు అంకితం చేయాలని, రాజకీయాలు ఎవ్వరికి శాశ్వతం కాదని మనం చేసే మంచి పనులే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అటువంటి కోవకు చెందినవారే రాజగోపాలరావుయని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు బగాది దివాకర్, పూజారి సత్యం, గురువెళ్ళి కన్నయ్య, వ్యవసాయాధికారి పూజారి సత్యన్నారాయణ, కళింగ పెద్దలు బల్లి కామరాజు, గురువెళ్ళి శేషగిరిరావు, బగాది సూర్యనారాయణ, ఉప్పాడ పూర్ణరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

విశాలాంధ్ర - సోంపేట : తిరుపతిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపి కయ్యారు. జాఈయ స్థాయికి ఎంపికైన విద్యా ర్థులు దుద్ది కౌశిక్ (8వ తరగతి), ఆనింగి తులసీ రాం (9వ తరగతి)లను ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డి.చిన్నాజీవర్మ, వ్యాయామ ఉపాధ్యాయుడు సిహెచ్.జైమారావు, సిబ్బంది తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు బారువ విద్యార్థులు : మండలం బారువ గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈ నెల 12 నుంచి 14వరకు జరగనున్న పోటీల్లో పాల్గొంటారని, అండర్ 17 విభాగంలో ఎస్.గాయత్రి, అండర్ 19 విభాగంలో ఎం.అఖిల్, జీ.కామేశ్వర రావు ఎంపికవ్వడంతో కోచ్ బి.మారుతీరావు మరియు సీనియర్ క్రీడాకారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వై.ఎస్.ఆర్-జగనన్న కాలనీగా పేరు పెట్టుకుంటాం

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : ఆటో కార్మికుల పరిస్థితి తెలిసిన ప్రభుత్వం ఆటో యూనియన్ సభ్యులు అందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని సోమవారం నాటి జిల్లా కలెక్టరేట్ ప్రజా ఫిర్యాదుల విభాగంలో వినతి పత్రాన్ని సమర్పించారు. స్థానిక భగవతి శ్రీ స్వేచ్ఛావతి ఆటో యూనియన్ అధ్యక్షుడు యు. యర్రయ్య, కొండా శంకర్, మోహన్ తదితరులు ఆటో యూనియన్‌లో 180మంది సభ్యులు ఉండగా వారిలో 35మంది కార్మికులకు ఇండ్ల స్థలాలు మంజూరైనట్లు తెలిపినా ఇంకా పది మందికి పట్టాలు అందివ్వలేదని, ప్రస్తుతం ఏ.ఎస్.పేట చర్చి వద్ద కేటాయించబడ్డ స్థలం ఊబిగుంట అని, అక్కడ ఇళ్ళు కట్టుకునే భవిష్యత్‌లో కూలిపోయే ప్రమాదం ఉందని, వేరే చోట స్థలాన్ని కేటాయించాలని విన్నవించారు. ఆటో యూనియన్ సభ్యులు అందరికీ ఒకే చోట ఇళ్ళ పట్టాలు మంజూరు చేసి, ఆటో నిర్వాహకుల ధీనస్థితిని దృష్టిలో ఉంచుకుని ఇండ్లను నిర్మించి ఇస్తే ఆ ప్రాంతాన్ని వై.ఎస్.ఆర్-జగనన్న కాలనీగా పేరు పెట్టుకుంటామని వినతిపత్రంలో పేర్కొని, జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు.

రైతాంగ రుణాలు తక్షణమే మాఫీ చేయాలి

వంకల మాధవరావు

విశాలాంధ్ర - పలాస : ఈ ఏడాది వర్షపాతం తక్కువ కారణంగా జిల్లా వ్యాప్తంగా కరువు ఛాయలు ఆలుముకున్నాయని, జిల్లాను కరువు జిల్లాగా తక్షణమే ప్రకటిస్తూ, యుద్ధ ప్రతిపాదికన రైతాంగాన్ని ఆదుకోవాలని అఖిల భారత రైతుకూలి సంఘం రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో రైతాంగాన్ని ఆదుకోవాలని సోమ వారం కరపత్రాలను ఆయన ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల కోసం చేసిన రుణాలను తక్షణమే మాఫీ చేసి కొత్త రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగన్ని అన్ని విధాలుగా ఆదుకో వాలని, తడిసిన ధాన్యాన్ని రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. జిల్లాలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ అప్పలరాజు, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ముగ్గురు ప్రభుత్వ బాధ్యులుగా రైతులకు ఎటువంటి ప్రయోజనం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టిడిపి తోనే భవిష్యత్తు

విశాలాంధ్ర - ఆమదాలవలస : టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి సనపల డిల్లేశ్వరరావు అన్నారు. సోమవారం బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెం టీ కార్యక్రమంలో భాగంగా ఆమదాలవలస మండలం బొబ్బిలి పేట గ్రామ పంచాయతీ లో నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యా లను ఇంటింటికి వివరించారు. రానున్న రోజు ల్లో జరగబోవు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నాయకులు యూనిట్ ఇంచార్జ్ బొడ్డేపల్లి గౌరీపతి గ్రామ సర్పంచ్ గుండు.రమణమూర్తి స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ నెల 24న తూర్పు కాపు సమ్మేళనం

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ప్రతీ ఏటా నిర్వహించే తూర్పు కాపు ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 24 న శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి సమీపంలో ఎచ్చెర్ల మండల కేంద్రం పరిధిలో కేశవరెడ్డి స్కూల్ పక్కన తోటలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న ప్రజాప్రతినిధులు తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సమ్మేళనం లో పాల్గొంటారు. ఎన్నో ఏళ్లుగా తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఎదురు చూస్తున్న భవన్ నిర్మాణం సత్వరమే జరపటానికి పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం రాత్రి నగరంలో ఏడు రోడ్ల కూడలిలో ఉన్న తూర్పు కాపు సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సభకు జిల్లా అధ్యక్షుడు సురంగి మోహనరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తూర్పు కాపు సంక్షేమ సంఘం పెద్దలు డోల జగన్ మోహన్ మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా శ్రీకాకుళం జిల్లా తూర్పు కాపు జాతి ఎదురు చూస్తున్న సామాజిక భవన్ నిర్మాణం కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని ఇది ముమ్మాటికీ జాతి ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న నిధుల సమీకరణ లో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా ఉద్యోగ సంఘాల నేతలు ఇంతవరకు చేసిన సేవలు పలువురు వక్తలు కొనియాడారు. భవన్ నిర్మాణానికి అవసరమైన నిధులు సేకరణకు గాను ఈ నెల 24 న శ్రీకాకుళం జిల్లా తూర్పు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్దయెత్తున ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయుటకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన తూర్పు కాపు సంక్షేమ సంఘం నేతలు తమ తమ అమూల్యమైన సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎస్. జోగి నాయుడు, రాడ కైలాస రావు, కొమ్ము రమణ మూర్తి, లంక గాంధీ, ఇజ్జాడ శ్రీనివాసరావు, వాళ్ళ శ్రీరాములు నాయుడు, అంకదాల తవిటన్న, పల్లి సురేష్, వాళ్ళ సన్యాసి నాయుడు, లోలు గు రాజశేఖర్, కిల్లారి నారాయణరావు, కెళ్ల కిషోర్ కుమార్, డోల బాలకృష్ణ, డాక్టర్ ఎం. రామ జోగి నాయుడు, డాక్టర్ చండక రామకృష్ణ, లుకలాపు రవి స్వామి, ప్రభాకర్ , కృష్ణా రావు,తదతరులు పాల్గొన్నారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

ఘనంగా శ్రీకాంత్ జన్మదిన వేడుకలు

పేదలకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - మెళియాపుట్టి : తూర్పుకాపు సంక్షేమం సంఘ కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ జన్మదిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు అనపాన రాజశేఖర్ రెడ్డి సోమవారం దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. తూర్పుకాపు సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖరరెడ్డి స్వగృహం వద్ద కేకును కత్తిరించి జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించడంతోపాటు ఆయన పేరు మీదుగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహణతో పాటు పలువురు వృద్దులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాతపాట్నం నియోజకవర్గ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, వైసీపీ నాయకులు అనపాన రాజశేఖర రెడ్డి, మండల వైస్ ఎంపీపీ ప్రతినిధి పాడి అప్పారావు, వైస్ ఎంపీపీ ఆదినాయుడు, జాడుపల్లి సర్పంచ్ ప్రతినిధి కన్నబాబు, పెద్ద పద్మాపురం ఎంపీటీసీ ప్రతినిధి ఉర్లాన రుషి, బాణాపురం సర్పంచ్ పెద్దింటి చంద్రరావు, సర్పంచ్లు గణపతి ప్రధాన్, గౌరీష్, వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు సత్వరం పరిష్కారం చూపాలి : జాయింట్ కలెక్టర్ నవీన్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందనలో వచ్చిన అర్జీలను అలసత్వం లేకుండా నిర్ణీత కాలవ్యవధిలో అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ అధికారులను ఆదేశించారు, అర్జీదారుల సమస్యలను సావదానంగా వింటూ, వివిధ సమస్యల పై వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న స్పందన వినతుల స్వీకరణ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, ఉప కలెక్టర్ జయదేవి, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ అర్జీలు స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకి చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే అర్జీలను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 250 అర్జీలు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారునికి ఇచ్చే సమాధానం పూర్తి వివరాలతో ఉండాలన్నారు. వివిధ శాఖలలో అర్జీలపై ఆరా తీశారు. అందరు విభాగాధిపతులు ప్రజల నుంచి వచ్చే అర్జీలు పట్ల అత్యంత శ్రద్ధ వహించి పరిష్కారం చూపాలన్నారు. జగనన్నకు చెబుదాం వెబ్సైట్ ద్వారా, జగనన్నకు చెబుదాం లో 1902 నంబర్ కు ప్రజలు సమస్యలను తెలియ చేయడం జరుగుతోందన్నారు. ఈ సమస్యలను అన్నింటినీ గడువు లోపు నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జి పరిష్కారానికి కారణమైన అంశంపై దృష్టి సారించాలన్నారు, వినతుల పరిష్కారంలో ఆలసత్వం చూపిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, మెప్మా పిడి కిరణ్, డి.ఎస్.ఓ వెంకట రమణ, డ్వామా పి.డి చిట్టీ రాజు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పిల్లలు గాలికి... సెలవుపై హెచ్ఎం

- నిలిచిన నాడు - నేడు పనులు
- గోరుముద్ద గుడ్డంత లేదు
- కుంటుపడుతున్న విద్యా ప్రమాణాలు

విశాలాంధ్ర - ఆమదాలవలస : విద్యార్థులు ఉపాధ్యాయులు మధ్య అసమానతలు సృష్టించి నిత్యం వివాదాలకు కేంద్ర బిందువుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మారింది. ప్రధానోపాధ్యాయిని తీరుతో విద్యార్థులు సిబ్బంది విసిగి వ్యాసాలు పోతున్నట్లు తెలుస్తోంది. గ్రామస్తులు, తల్లిదండ్రులు వచ్చి ఉపాధ్యాయులు నిలదీస్తారన్న సమయంలో మెడికల్ లీవ్ పై ప్రధానోపాధ్యాయులు వెళ్లి పోవడం ఇక్కడ నెలకొన్న వివాదాలకు ఆజ్యం పోస్తుంది. మండలంలోని వెదుళ్ళ వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 96 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయన వ్యవహార తీరు వివాదాస్పదంగా మారుతుంది. ఆయన తీరు వివాదం... పాఠశాలలో జరుగుతున్న ప్రతి అంశములను ఆయన వివాదాలు రేకెత్తిస్తుంటారు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రేయర్ జరుగుతున్న సమయంలో ఒలే ఎంగిలి మెతుకులు దాన అని సంబోధించడం తో విద్యార్థులు మదన పడుతున్నారు. జాగ్రత్త పప్పులో కాలే సేయగలరు అంటూ చులకనగా మాట్లాడటంతో విద్యార్థులు మండి పడుతున్నారు. ఈ విషయం వారి తల్లిదండ్రులకు చెప్పి తనని అడుగుతారని తెలుసుకొని ముందుగానే సెలవు పై వెళుతుంటారు. ఉపాధ్యాయుల పైన ఏహ్యభావం ప్రదర్శిస్తూ తన నైజాన్ని చాటుకుంటాడని తెలిసింది. వారంలో కనీసం రెండు రోజులైనా గుడ్డు చెక్కిలు అందించడం లేదనేది బహిరంగ విమర్శ. వారానికి ఒక రోజు వచ్చే స్టాక్ ఏజెన్సీ సభ్యుల ఇంటి వద్దనే ఉంచటం, స్టాక్ రిజిస్టర్ కూడా పాఠశాలలో లేకపోవడంతో, గుడ్లు పాడవు తున్నాయని, చెక్కిలు ఎలుకలు కొరికేస్తున్నయని ఏజెన్సీ సభ్యులు చెబుతు న్నారు. గుడ్లు పాడైనప్పుడు పాఠశాల అధి కారిగా ఎందుకు ఉన్నతాధి కారులకు ఫిర్యా దు చేయలేదో తెలియదు. దీంతో మధ్యాహ్న భోజన పథకానికి జగనన్న గోరుముద్దలో గుడ్డు **ఉడకడం లేదు.** **వేధించడంలో ఘనుడు...** విద్యార్థులను వాదన బోధ నేతర సిబ్బందిని వేధించడంలో ఘనపాటిగా నిలిచారు. ఈ ఏడాది విద్యా సంవత్సరంలో కొంతమంది విద్యార్థుల పేర్లు నమోదు లోను, టిసి ఇచ్చి సమయంలోను మానసిక స్థిమితం లేని వ్యక్తుల వ్యవహ రించారన్న ఆరోపణలు ఉన్నాయి. హాజరు పట్టి నుండి విద్యార్థుల పేర్లు తొలగించి వారికి టి సీలు ఇచ్చి పంపిం చడంతో తల్లిదండ్రులు సభాపతి ఇంటి వద్ద పంచాయతీ నిర్వహించారు. వారికి జగనన్న కిట్టు ఇవ్వకపోవడంతో పంచాయతీ అక్కడికి చేరింది. విద్యార్థులకు ఉపాధ్యాయులు హాజరు వేయలేదని అందుకే వారిని తొలగించా నని చెప్పడం విశేషం. నిత్యం వివాదా లకు నెలవుగా పాఠశాల మారడంతో విద్యా ప్రమాణాలు కుంటు పడుతున్నాయి. నిలిచిన నాడు నేడు పనులు... జిల్లా పరిషత్ ఉన్నత



పాఠశాలకు నాడు నేడు ద్వారా సుమారు 60 లక్షల రూపాయలు మంజూరు అయింది. వీటిలో వివాదాల కారణంగా సగం పనులు కూడా జరగలేదు. గతంలో నాడు నేడు పనులు నియోజకవర్గ సమీక్ష సమావేశం శారద కళ్యాణ మండ పంలో జరిగింది. ఈయన పెట్టిన వివాదం కారణంగా గ్రామంలోని అధికార పార్టీ నాయ కుల మధ్య వర్గ విభేదాలు చెలరేగి బాబు సమావేశంలోనే వాదనలకు దిగారు. పాఠ శాల పరిస్థితులు బహిర్గతమయ్యాయి. అధి కార పార్టీ చెదిరి బాహాబాహికి దిగడంతో అక్కడ ఉన్న వారంతా బిత్తర పోయారు. ఆయాకు సెలవిచ్చి విద్యార్థులతో పనులు... పాఠశాలలో పనిచేస్తున్న కవెంజర్ కు సెలవు పై పంపించి విద్యార్థులచే బాత్రూములు క్లీన్ చేయించి అక్కడ నీటిని ఏర్పాటు చేయించడం వంటి కార్యక్రమాలు ప్రోత్సహించి, పను లు చేయని విద్యార్థులపై దుర్భాషలాడడం చేస్తుంటారని విమర్శలు ఉన్నాయి.

అధికారి ఏమన్నారంటే... పాఠశాలలో జరుగుతున్న పరిణామాలపై డిప్యూటీ ఈవో ఆర్ విజయ్ లక్ష్మిని వివరణ కోరగా సోమవారం ఉదయం ఫోన్ చేశారని, తన గుమస్తాకు మెడికల్ లీవ్ కు సంబం ధించిన వివరాలు అందించారని తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరుగుతున్న విషయాలపై పరిశీలన చేస్తానని ఆమె వెల్ల డించారు. నాడు నేడు పనులపై ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్ ను వివరణ కోరగా సాంకేతిక కారణాలవల్ల పనులు నిలిచాయని త్వరలో నే పనులు పూర్తి చేస్తామని అన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను ఎస్పీ పరిశీలన

విశాలాంధ్ర - పలాస : పలాసలో ఈనెల 14న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పలాస పర్యటన సందర్భంగా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రాధిక సోమవారం పరిశీలించారు. హెలిప్యాడ్, బహిరంగ సభ రైల్వే క్రీడా మైదానం, కిడ్నీ ఆసుపత్రి పరిసర ప్రాంతా లను పరిశీలించి అధి కారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పోలిస్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పలాస రూట్ మ్యాప్ పై అధికారులతో చర్చించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ఆమెతో పాటు డిఎస్పీ నాగేశ్వర్ రెడ్డి, పలాస, ఇచ్చాపురం, సోంపేట, టెక్కలి సిఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా భవిష్యత్‌కు గ్యారంటీ

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : తెలుగుదేశం పార్టీ నిర్దేశాల మేరకు స్థానిక 11వ వార్డు కౌన్సిలర్ ఆశి లీలారాణి క్రమం తప్ప కుండా వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యా రంటీ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. సోమవారం వార్డు పరిధి బొబ్బిలి వీధి, కొయ్య వీధుల్లో పర్యటించి మహిళలకు తెలుగుదేశం ప్రభుత్వం ఆధ్వర్యంలో అందివ్వబోయే పథకాలను వివరిస్తూ ఉత్సాహంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ తరపున భవిష్యత్‌కు గ్యారంటీ కార్డులను ప్రజలకు అందించి, రాష్ట్రంలో నెలకొన్న అరాచక పరిస్థితులు, వెనుకబడుతున్న అభివృద్ధి తదితరాలను వివరించి, నారా చంద్రబాబు ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పాలనతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని వివరించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - జలుమూరు : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి సోమవారం ఆకస్మికంగా పీహెచ్‌సీని తనిఖీ చేశారు. మొదట హాజరు పట్టిని పరిశీలించారు. తదుపరి అన్ని రికార్డులను పరిశీలించి లక్ష్యాలను వైద్యాధికారి డా. శ్రీకాంత్ ని అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన స్కీమ్ లో ఏప్రిల్ 2022 నుండి జరిగిన ప్రసవాలను 100 శాతం ఆన్లైన్ చెయ్యాలని సూచించారు. వాతావరణం లో మార్పుల కారణంగా అప్పుడే పుట్టిన పిల్లల నుండి 5 సం. వరకు నుమోనియా (శ్వాస కోశ వ్యాధులు) ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బాలల సంక్షేమ రక్షణ కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల బాలల సంక్షేమ రక్షణ కమిటీ ఏర్పాటు అయింది ఎచ్చెర్ల ఐసిడిఎస్ పరిధిలో ఏర్పాటు అయిన ఈ కమిటీ ఎంపీపీ మొదలవలస చిరంజీవి అధ్యక్షునిగా సిడిపిఓ డి పాపి నాయుడు కన్వీనర్ గా వివిధ శాఖల కు చెందిన 14 మంది సభ్యులతో ఏర్పాటయింది బాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ కమిటీ స్పందించి అవసరమైన నివారణ చర్యలు చేపడుతుందని సిడిపిఓ పాపి నాయుడు తెలిపారు

మానవులు ఎలా బతకాలో రామాయణం చెబుతుంది

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మనిషి ఎలా బ్రతకాలో రామా యణం చెబుతుందని, ప్రతి ఒక్కరు శ్రీరాముడు మార్గంలో పయనించాలని కొర్ని కొర్లాం ప్రముఖ ప్రవచన కారులు కొర్లాం వల్లభా చార్యులు అన్నారు. సోమవారం మండలం గురువెళ్ళిపేట గ్రామంలో శ్రీ సీతారామ చంద్రస్వామి మందిరంలో ఆలయ కమిటి సభ్యులు మెట్ట మన్మధరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సత్సంగ సమావేశంలో ఆయన పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం సత్సంగ సమావేశంలో పాల్గొన్న భక్తులకు నారాయణసేవ గ్రామ పురజనులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవచన కారులు కిట్టాలపాడుకు చెందిన పెద్దింటి లచ్చమ్య స్వామి, ఊడికలపాడు శ్రీరామక్రిష్ణరమణా కరుణ గీతాశ్రయంకు చెందిన సనపల కరుణ్‌కుమార్‌లు ఉన్నారు.

జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

జిల్లా పరిషత్ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్

విశాలాంధ్ర - కవిటి : వైయస్ జగన్మోహన్ రెడ్డి తోనే రాష్ట్ర అభివృద్ధిసాధ్యమని జిల్లా పరిషత్ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ అన్నారు. ఈ మేరకు సోమవారం మండలం లోని నెలవంక సచివాలయం పరిధిలో స్థానిక సర్పంచ్ గౌతమి కుమార్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ హాజరయ్యారు.ముందుగా సంక్షేమ పథకాల డిస్ప్లే బోర్డును ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ సచివాలయాలు,వాలంటీర్ల వ్యవస్థ ద్వారా గడప వద్దకే పాలన అందిస్తూ ఎన్నడూ లేని విధంగా ప్రతి గ్రామంనకు డాక్టర్లు రావడం వైద్య పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారన్నారు. ఆసరా,చేయూత,చేదోడు లాంటి పథకాలతో వివిధ వర్గాల వారు తమ కాళ్ళ మీద తాము నిలబడేలా స్వయం ఉపాధి చేసుకుంటున్నారన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిది, వైసిపి మండల అధ్యక్షులు కడియాల ప్రకాష్, వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, ఏఎంసి వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్యా, ఎంపీటీసీ సభ్యులు దుక్క దుదమ్మ,ఆర్ బి కే చైర్మన్ దువ్వ కృష్ణ రెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి పులకల శ్రీరాములు, మండల జె సి ఎస్ అధ్యక్షులు జల్లు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సత్యవతి

విశాలాంధ్ర - ఆమదాలవలస : మిచింగ్ తుఫాను బాధితులను ప్రభుత్వం సత్వరం ఆదు కోవాలని ఆమదాలవలస మండల తహసిల్దార్ ద్వారా సీఎంకి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్య వతి మరియు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీ రావులు కోరారు. ఇటీవల సంభవించిన తుఫాను వల్ల రైతులు రైతు కార్మికులు సన్నకారు రైతులు తీవ్రమైన పంట నష్టాలు పాలై చేతికి అందిన పంట నీటీ పాలు అయిందని వారిని ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందజేసి రైతులను అప్పుల బారిన పడకుండా ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ముంపుకు గురైన పంటను స్థానిక ఆర్బికే ద్వారా ప్రభుత్వం అంచనా వేసి ముంపు ప్రాంతాలను ప్రకటించవలసిందిగా కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది.నేరుగా అధి కారులు పంట పొలాల్లోకి వెళ్లి పంట నష్టాన్ని అంచనా వేయవల సిందిగా కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది అని రిప్రజెంటేషన్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేశారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొడ్డేపల్లి గోవింద గోపాల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి లఖినేని నారాయణరావు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బసవ షణ్ముఖరావు యువజన కాంగ్రెస్ నాయకులు లఖినేని సునీల్ కుమార్ సనపల నర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 45 ఫిర్యాదులు

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ 'స్పందన' కార్యక్రమంలో 45 ఫిర్యాదులు అందాయని అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్ తెలిపారు. ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. కుటుంబ తగాదాలు 10, పౌర సంబంధమైనవి 8, ఆస్తి తగాదాలకు సంబంధించినవి 7 తోపాటు, పాతవి 8, చీటింగ్ పై 2, ఇతరత్రా పలు అంశాలపై 10 అందాయి. జిల్లా పరిదిలోని ప్రజలు నేరుగా వచ్చి అదనపు ఎస్పీను కలిసి తమ యొక్క సమస్యల తెలియపరిచి అర్జీలను అందజేశారు. వారి యొక్క సమస్యలకు సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్కరిని అర్జీలు విషయాలు అడిగి తెలుసుకొని సంబందిత పోలీస్ స్టేషన్ల పరిదిలోని అధికారులకు తక్షణమే ఫోన్ ద్వార సమాచారం అందించి ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఒకటో తేదీనా జితాలు చెల్లించాలి

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : ఉద్యోగులకు, పెన్షనర్స్‌కు ప్రతినెల ఒకటీవ తేదీనా జీతాలు చెల్లించాలని యుటీఎఫ్ సీనియర్ నాయుకుడు సామ సంజీవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో, మండలంలో చాలా మంది ఉపాధ్యాయులకు 11వ తేదీ వచ్చిన ఇప్పటి వరకు జీతాలు అందకపోవడంతో పిల్లల చదువులు కోసం, ఇతర సమస్యలు వల్ల బ్యాంకులు, ఇతర ప్రైవేటు పైనాన్స్‌ల వద్ద లోన్‌లు తీసుకొని వారికి ఈఎంఐలు సమయానికి కట్టలేక పోవడంతో వారికి అధిక వడ్డీతో కట్టాల్సి వస్తుందని, ప్రతీనెల ఇదే పరిస్థితి నెలకొందని ఆయన అవేదన వ్యక్తం చేశారు. నిన్ననే ఒక సీపీఎస్ ఉపాధ్యాయులు ఆత్మహత్య చేసుకున్నారని దీనిని దృష్టిలో పెట్టుకొని ఒకటో తేదీకి ఉద్యోగులకు జీతాలు, పించనర్లుకు పించన్ చెల్లించాలని యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి వై. వాసుదేవరావు, జి.నారాయణరావు, బి.ఆనందరావు, పి. సింహాచలం తదితర యుటీఎఫ్ ప్రతినిధులు కోరారు.

వికసిత్ భారతలో పాల్గొన్న బీఆర్ఏయు వీసీ

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : నీతి అయోగ్ సూచనల మేరకు సోమవారం కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన భారత కార్యక్రమం వర్క్ షాప్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ అధికారులు అధ్యాపకులు పాల్గొన్నారు. అమరావతిలోని రాజభవన్ నుంచి విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు హాజరయ్యారు. వికసిత్ భారత్ - 2047 లక్ష్యం కోసం ఆలోచనల మదింపు అనే అంశంపై న్యూఢిల్లీ నుంచి ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో ప్రసంగించారు. పలు రంగాల్లో మార్గదర్శకంగా నిలుస్తున్న భారత 2027 నాటికి సూపర్ పవర్ కావాలన్నది ఆశయమని ప్రధాన ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్షించారని విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. విద్యారంగా నిపుణులు పరిశోధకులు విద్యార్థులు వికసిత్త భారత్లో భాగస్వామ్యులై తమ ఆలోచనలను ఆవిష్కరణలను పంచుకోవాలని ప్రధాని సూచించారన్నారు. కేంద్ర పౌరుయన శాఖ మంత్రి జ్యోతిరావు సింధియా ప్రసంగించారు అన్నారు వర్చువల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజభవన్ నుంచి గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడారు కాగా అంబేద్కర్ వర్సిటీలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సిహెచ్ ఏ రాకేంద్ర ప్రసాద్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డికి అడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

విశాలాంధ్ర - ఎచ్చర్ల : ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో పోలీసు సిబ్బంది సోమవారం పెరేడ్ నిర్వహించారు. ఈ పెరేడును పరిశీలించిన అడిషనల్ ఎస్పీ జే తిప్పే స్వామి మాట్లాడుతూ వి.ఐ.పి భద్రత, సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు జరిగే సమయంలో 144వ సెక్షన్ అమలులో ఉన్నప్పుడు సమర్థవంతంగా ఎదుర్కోవడం పై వివరించారు. సిబ్బంది సమయపాలన పాటించడంతో మాబ్ నిరసన కారులను అదుపు చేయవచ్చు అన్నారు. అలాగే సాయుధ సిబ్బంది మాక్ డ్రిల్, మాబ్ ఆపరేషన్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ఉమా మహేష్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి మీనాక్షి

విశాలాంధ్ర - పలాస : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఈనెల 14 వ తేదీన పలాసలో 200 పడకల ఆసుపత్రి, కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించనున్న నైపద్యంలో వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి బొడ్డేపల్లి మీనాక్షి వైద్యాధికారులకు సూచించారు. పలాస కిడ్నీ ఆసుపత్రిని సోమ వారం ఆమె పరిశీలించారు. ఆసుపత్రిలో మందులు అందు బాటులో ఉంచాలన్నారు. వైద్యాధికారుల నుంచి సిబ్బంది వరకు అందుబాటులో ఉండి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సిఎం పర్యటనలో బాగంగా హెలిప్యాడ్, కిడ్నీ ఆసుపత్రి, సిఎం బహిరంగ సభ వద్ద పూర్తి స్థాయిలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని చెప్పారు. మెడికల్ క్యాంపులు వద్ద పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రథమ చికిత్స కిట్ లు ఉంచాలన్నారు. ఆమెతో పాటు రెంటికోట, వెంకటాపురం, అక్కుపల్లి అర్బన్ హెల్త్ సెంటర్స్ వైద్యాధికారులు డాక్టర్ టి. సునీల్ కుమార్ డాక్టర్ దేవి డాక్టర్ శ్యామ్ డాక్టర్ సాయి, డాక్టర్ విజయ్ నారాయణరావు, ఎన్జీవో నాయకులు బోనేల.గోపాల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 22న సుబ్బారావు పాణిగ్రాహి వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర - పలాస : పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో ఈనెల 22న విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి 54 వ వర్ధంతి వేడుకలను నిర్వహించ నున్నామని అరుణోదయ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ తెలిపారు. సోమవారం పలాస సూది కొండలో విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి 54వ స్మారక సభను విజయవంతం చేయాలని అరుణోదయ, ప్రజా కళా మండలి సంస్థల ఆధ్వర్యంలో ప్రచార యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాణిగ్రాహి జీవితం నిత్య పోరాట చైతన్యమన్నారు. పాణిగ్రాహి అమరత్వానికి నేటికి యాభై నాలుగేళ్ళు పూర్తవుతున్నా విప్లవ స్ఫూర్తితో చరిత్రలో పెన్నూ, గన్నూ ఏకం చేసి ఉద్యమించిన విప్లవ వీరుడుగా, ప్రజా కవిగా, ప్రజా కళాకారునిగా శాశ్వత చిరునామాగా పాణిగ్రాహి నిలిచిపోయారన్నారు. శ్రీకాకుళ ఉద్యమం రాజ్యం నిర్బంధాన్ని ప్రయోగించినప్పుడు, చంకలో జముకు వేసుకొని రాష్ట్రవ్యాప్తంగా జముకుల కథను ప్రదర్శించి ప్రజల మద్దతును కూడగట్టిన పోరు ధీరుడై నిలిచిన పాణిగ్రాహిని 1969 డిసెంబరు 22న మందస దరి రంగోమెటియా కొండల్లో బూటకపు ఎన్‌కౌంటర్‌లో అప్పటి కాంగ్రెస్ నియంత పాలకులు అమానుషంగా కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతిమ శ్వాస వరకూ రాజ్యంపై యుద్ధం చేసిన పాణిగ్రాహి 35 ఏండ్ల స్వల్పకాలమే జీవించారని సన్నశెట్టి వివరించారు. యాభై నాలుగేళ్ళ క్రితం పాణిగ్రాహి సాగించిన పోరాట వారసత్వంతో నేడు మరింత పట్టుదలతో సమరశీల సంఘటిత ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన కర్తవ్యాన్ని వర్తమాన సవాళ్ళు గుర్తుచేస్తున్నాయని అన్నారు. ఈ ప్రచార యాత్రలో సిపిఐ (యం .యల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు గౌరకల బాలకృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పలు ప్రజా సంఘాల నాయకులు రాపాక మాధవరావు, బర్ల గోపి, సార జగన్, పోతనపల్లి మల్లిబాబు, బర్ల శారద, వరాలు, స్వర్ణ లక్ష్మి, జగన్, సభి , మోహన్ విఘ్నేశు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టైటిల్ యాక్ట్ రద్దు చేయాలి

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ఏపీ టైటిల్ యాక్ట్ 23లో పొందు పరిచిన క్లాజ్ 37, 38 వెంటనే రద్దు చేయాలని ఈ క్లాజస్ న్యాయవాదులకు గొడ్డలి పెట్టుగా ఉందని బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయ లక్ష్మీ బాయి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టైటిల్ చట్టం (2023) అమలు చేసినందుకు నిరసనగా జిల్లా బార్ అసోసియేషన్ పిలుపుమేరకు స్థానిక న్యాయ వాదులు సోమవారం విధులు బహిష్కరించేందుకు తీర్మానించారు. ఈ సందర్భంగా సోమవారం ఆమదాలవలస కోర్టు ప్రాంగణంలో గల బార్ అసోసియేషన్ కార్యాలయం ముందు బార్ అధ్యక్షురాలు కనితి విజయలక్ష్మి ఆధ్వర్యంలో న్యాయ వాదులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టంలోని ప్రొవిజిన్స్‌లో పేర్కొన్న అంశాలు లిటిగంట్, పబ్లిక్, న్యాయవాదులకు చెంపపెట్టు లాంటి ది అన్నారు. సివిల్ కోర్టు పరిధి నుండి పూర్తి గా లిటిగేషన్ తప్పించి, ప్రభుత్వమే ప్రత్యేక అధికారిని నియమించి లిటిగెంట్, పబ్లిక్ యొక్క ఆస్తిపై హక్కులను పరిష్కరించి అవ కాశం కల్పించారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన చట్టంలో స్థానికంగా ఉన్న సివిల్ కోర్టులకు పరిధి లేకుండా చేసి హైకోర్టుకు మాత్రమే అవకాశం కల్పించినట్టు చట్టంలో పేర్కొవటం దురదృష్టకరమన్నారు. తక్షణమే ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేయా లని విజ్ఞప్తి చేశారు. విధులు బహిష్కరించిన వారిలో న్యాయవాదులు జి.ప్రభాకర్ రావు పి.వరాహ నరసింహులు తమ్మినేని అన్నం నాయుడు బి.సీతారాం బి.రాజేశ్వరరావు బి.మోహన్ రావు హెచ్ అచ్చం నాయుడు తది తరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర - పలాస : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఈనెల 14 న పలాస పర్యటనలో భాగంగా మున్సిపాలిటీలో పారిశుధ్యంపై దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. సిఎం పర్యటనలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న పనులను సోమవారం మున్సిపల్ అధికారులతో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆదేశాల మేరకు సుమారు 7 జేసిబిలు, ట్రాక్టర్లు సహాయంతో పారిశుధ్యం పనులు చేపడుతు న్నామన్నారు. రోడ్లకు ఇరువైపులా చెత్త చెదారాన్ని తొలగిస్తామని చెప్పారు. సిఎం జగన్మోహన్రెడ్డి రోడ్ షో లో బాగంగా కిడ్నీ ఆసుపత్రి నుంచి రైల్వే క్రీడా మైదానం వరకు చేపడుతున్న నైపద్యంలో కాశీబుగ్గ సాయిబాబా మందిరం వద్ద పాడైన రోడ్డుకు మున్సిపల్ నిధులతో మరమ్మతులు చేపట్టి రోడ్డు పనులు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం పార్కింగ్, కిడ్నీ ఆసుపత్రి, హెలిప్యాడ్ పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ టి నాగేంద్ర కుమార్, డిఈ సునీల్ కుమార్, ఎఇ అవినాష్, వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, కౌన్సిలర్ దుర్గా శంకర్ పండా పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ప్రధానమంత్రి జన్ అరోగ్య యోజన కార్డుల

ఎంపీడీవో ఫణీంద్రకుమార్

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : కేంద్రప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు పై అవగాహన పెంచుకోవాలని స్థానిక మండల పరిషత్ అబివృద్ధి అధికారి కె.ఫణీంద్రకుమార్ అన్నారు. ఆయన సోమవారం మండలంలో గల నిమ్మాడ పంచాయతీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ప్రధానమంత్రి జన్ అరోగ్య యోజన కార్డులను, ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్‌ను అందజేశారు. అంతకుముందు కేంద్రపథకాలను వివరించే 2024 సంక్షేమ క్యాలండర్‌ను అవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అందజేస్తోందని, వీటిపై గ్రామీణ స్థాయిలో చాలా మందికి అవగాహన లేకపోవడం వల్ల లబ్ధి చేకూరడం లేదని ప్రభుత్వం దృష్టికి వచ్చిన సందర్భంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి మండల పార్టీ అధ్యక్షుడు మెట్ట తిరుమలరావు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ ఆటస్థలం ఆక్రమణలకు గురౌతుంది

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట పట్టణంలో గల హైస్కూల్ ఆటస్థలం ఆక్రమణలకు గురి అవుతుందని సోంపేట జెడ్పీటీసీ తడక యశోద పలాస ఆర్డీఓ భరత్‌నాయక్‌కు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ భరత్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆక్రమణలను తొలగించి ఆట స్థలాన్ని కాపాడవల్సిందిగా పేర్కొన్నట్లు జెడ్పీటీసీ తడక యశోద తెలిపారు. ఈమెతో పాటు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తడక జోగారావు, ఎంపీటీసీలు బొమ్మిడి ధర్మరాజు, నర్తు జోగారావు, పోలాకి రమణమూర్తి పాల్గొన్నారు.